# దీపావళి సరదా

శ్రీమతి సమయమంత్రి వందేమాతరంగారు

"అబ్బబ్బ మాట వినబడనీయకుండ యేమల్లరత్రా!! మీనాన్న యెందుకో పిలుస్తున్నారు కనుక్కోరా, రామం" అంది వాళ్ళమ్మ.

"టపాకాయలు కొనమని చెప్పవుటే అమ్మా నాన్నతో?"

"కొంటారులే తొందరేమిటి?"

"బావను రమ్మని రాశారా నాన్న? యెప్పుడొస్తాడే బావ?"

"నీకేంరా యెప్పుడో వస్తాడు."

"అలాకాదు త్వరగా రమ్మని వ్రాయమను అక్కను కొట్టించాలి"

"రమణా వాడినేమన్నావే?

"నే చెపుతానుండవే అమ్మా, మరేమో నే యిందాకా జామకాయలు కోస్తుంటే సూరమ్మగారితో చెప్పి కొట్టించిందే. బావరానీ చెప్పకపోతే?"

"వాళ్ళ చెట్టుకాయలు కోయవద్దన్నానమ్మా. వినక చెట్టెక్కాడు. సూరమ్మగార్ని పిల్చి చెప్పా. నాలుగు తిట్టింది. బావరానీ, నీపని చెపుతానని గంతులేస్తున్నాడు రామం."

"మేష్టారొచ్చి గంటయితే రావేమిరా" అంటూ బెత్తంతో నాలుగు వాయించారు వాళ్లనాన్న. ప్రయివేటు చెప్పుకోటానికి వెళ్లాడు రామం.

నాగభూషణంగారు తాలూకాకచ్చేరిలోగుమాస్తా. జానకమ్మ వారి సహధర్మచారిణి. నాగభూషణం గార్కి పిత్రార్జితంబాపతు సామాన్యమైన యిల్లుకలదు. మెట్టపొలం కొద్దిగాయుంటే విక్రయించి చిన్న డాబా వేసుకొన్నారు. రమణయే వారి తొలిసంతానం. రాజ్యం రామచంద్రం చిట్టి యీనలుగురే వారి సంతతి. రమణారాజ్యంల పెండ్లిలోనే వుపనయం కానిచ్చి గట్టునపడ్డారు జానకమ్మగారు. చిట్టి రెండేండ్ల లోపువాడే. పెద్దదగు రమణ కాపురమునకు వెళ్ళినది. రాజ్యం యింకా చదువులోనే యుంది. దసరాపండుగకు తీసుకొనివచ్చిన రమణను పంపుడని వర్తమానం చేశారత్తవారు. దీపావళికి తమ యల్లుని బంపవలసినదనియూ పండుగ గడచిన వెంటనే అమ్మాయియూ అల్లుడునూ బయలుదేరి వత్తురనియూ నాగభూషణంగారు తమ వియ్యంకునకు వ్రాశారు.

నాలుగురోజులు ముందుగానే వచ్చాడల్లుడు. కొన్ని కారణములవల్ల రావటానికి వీలులేదని రెండవ యల్లుడు తెలియపరచినాడు. నరకచతుర్దశి నాటి వుదయం కాఫీ యుప్మా తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళింది రమణ. వుప్మా స్పూనుతో యిటు అటు తిప్పి పరిశీలన చేస్తున్నాడు సుందరం. నానవేసి నల్లరంగు పోవునట్లు శుభ్రముగా కడగిన చింతగింజలు కనుపించిన వతనికి. చిరునవ్వు నవ్వుకుంటూ వుప్మా ప్లేటు దూరంగా పెట్టి కుర్చీలో కూర్చున్నాడు. చప్పట్లుకొట్టి గట్టిగా నవ్వుతూ రామం వచ్చి బావ వళ్లో పడ్డాడు. రాజ్యం నవ్వాగక భోజనాలింట్లోకి పరుగెత్తింది. 'రామం మీఅక్కను పిలు, కొత్త రకపు జీడిపప్పులు తినిపిస్తా' నన్నాడు సుందరం.

'నీవే తిను: మధ్య అక్కయ్యా కెందుకు. కష్టపడి తయారు చేసినందుకు. అక్క యేమీ యెరుగదు. నీకు తీసుకురావటానికి పళ్ళెంలో పెట్టి గ్లాసుకోసరం వంటయింట్లోకి వెళ్లింది. నాన్నావాళ్లూ చూడకుండా అందులో పప్పులేరి నోట్లో వేసుకొని జేబులోంచి తీసి వుప్మాలోకుక్కా.'

'పాపం చాలా కష్టపడి తయారు చేసిన పప్పులు వృధాకాకుండా నీనోట్లో కుక్కుతానుండు' అని చేతికొచ్చినంత యుప్మాతీసుకొని రామం నోట్లో పెట్టబోవుచుండగా మరియొక పళ్లెరముతో నుప్మాయూ వేరొక గ్లాసుతో కాఫీయూ తీసుకొని రమణ వచ్చింది. వెంటనే తమ్ముడు విడుదలై పరు

గత్తి వెళ్లినాడు. 'అగ్రహమొచ్చినట్టుందే? యీలా హాస్యపుబనుల్లో తాను గెల్చి మిమ్మోడించాలని మీ రాకకోసరం చాలా వేగిరపడ్డాడు మా రాము. వాడిని క్షమించి వాటిని వదలి యివి ఆరగించం'డని చేతిలోనివి బల్లపై నుంచింది రమణ. 'అనుమానం వీడందే యేలా తింటాను?' అన్నాడు సుందరం. 'మాటల కవకాశంలేదు. అమ్మ వక్కతే వంట చేయుచున్నది. ఆమెకు సాయపడాలి వెళ్లి. సందేహాలు తర్వాత తీర్చుకోనవచ్చు'నని లేనగవు మోమున నంకురింప గిరుక్కున తిరిగి వెళ్లి పోయింది రమణ. తమలపాకులు వేసుకొంటూ చుట్టివున్న చిలకలను విడదీస్తున్నాడు సుందరం. ఆచుట్టమధ్య లేత అరటాకు ముక్కలు కనుపించినవి. 'యిది రాజ్యం పని. వీళ్లిద్దరివంతూ అయినది. యిక మా రాణి రమణవంతున్నది జాగ్రత్తగా నుండాలే' అనుకున్నాడు సుందరం.

కాగితం కలం చేతపట్టుకొని పిల్లలు చెప్పినవి వ్రాస్తున్నారు నాగభూషణంగారు సావడిలో కూర్చుని. రామం రాజ్యం చెప్పినవన్నీ వ్రాసుకొని 'రమణా నీకేం కావాలో చెప్పుతల్లీ' యన్నారు పెద్దకుమార్తెతో. 'నాకేం వద్దు నాన్నగారూ యింకా చిన్నపిల్లనా?' అన్నదామె.

అప్పుడే పెద్దదానవైతివా వెఱ్ఱితల్లీ! మేమున్నంత కాలం చిన్నబిడ్డవే?'

'వట్టిది నాన్నగారూ, అక్కకేమోనే వేళాకోళంటపాసులు కావాలట తెండి'అన్నాడు రామం. తమ్మునకేసి కోపంగా చూచి వెళ్ళిపోయింది రమణ' 'యిదిగో నీకేం కావాలో చెప్పు మళ్లీమళ్లి తిప్పక. 'వూదా చీర కావాలి కదూ? తెస్తారే కోపగించకు'అంటూ పైమీద కండువా వేసుకొని వెళ్ళినారు నాగభూషణంగారు. కూలివానిచే సామాను పట్టించుకొని సాయంకాలం నాలుగింటికల్లా యిల్లు చేరారు నాగభూషణంగారు.

త్వరగా భోజనాలు ముగించుకొని వీధిలో అరుగుల నిండా యున్న దీపాలవద్ద చేరారంతా బాణసంచాతో. రమణ చిట్టిని వొళ్లో కూర్చోబెట్టుకొని కూర్చుంది చూస్తూ. వీధిలో సందడి డాబా మీదనుంచే చూస్తున్నాడు సుందరం. చిట్టి వుంతుల్ని వూయల్లో పరుండబెట్టి వేళాకోళంటపాకాయలపెట్టె తీసికొని డాబా యెక్కింది అడుగుల శబ్ద మేనికాకుండ రమణ. పిల్లలు వెలిగించు రంగు రంగుల మతాబులవంక చూస్తూ నిలబడియున్న సుందరం రమణ రావటం చూడనేలేదు. అతని వీపుపై కొట్టటాన్కి ఒక గుండును తీసింది. తప్పు చేస్తున్నావేమో జాగ్రతయని అంతరాత్మ బోధించింది. చేయి దానంతటదే వాలింది. దీపావళి సరదా! కోప మెందుకొస్తుంది కొట్టమని బాల్యచాపల్య మొకవంక వేధింప సాహసించి వినుకొద్దీ వీపుపై పేల్చింది. టపీమని పెద్ద శబ్ధమయేసరికి వులిక్కిపడి వీపు తడుముకొంటూ తిరిగి చూచాడు. భర్తకు కనుపించకయే వెనుకకు వెళ్ళి రెండుచేతులతో గుండ్లనాతని వీపుమీద విసరటం ప్రారంభించింది రమణ. 'కలియుగ సత్యభామైనా వేమిటి? గుండ్లు చేతికి తీసుకొను సావకాశమున్నట్లు లేదు. ఒకటే పేల్చటం. అవేలా వుంటాయో చూడనియ్యి'అంటూ రమణను సమీపింప బోతుంటే, రమణ పరుగు ప్రారంభించింది. యెంతసేపని పరుగిడగలను ఆయాసంతో ఓమూల కూలబడింది ఆమె చేతిలోని పెట్టెను లాగుకొని అక్కణ్ణుంచి లేచేవరకూ ఆ గుండ్లలో వేటాట్టం ప్రారంభించాడు సుందరం. తిరిగితిరిగి అలసిపోయింది రమణ. గదిలోనికి వెళ్ళి తలుపు వేసుకుందామని పరుగిడింది. కూడానే వెళ్లాడు సుందరం. ఫాలభాగాన్నున్న చెమటపైట చెరగుతో నొత్తుకొనుచూ ప్రక్కపైవాలింది రమణ. చేతిలోని గుండ్లు ఆఖరైనందున వట్టిపెట్టెనే భార్యపై విసరి చేరువనున్న కుర్చీలో కూలబడ్డాడు సుందరం. పిల్లలచే టపాకాయలు కాల్పించు సందడిలో యున్న తలితండ్రు లీ దృశ్యాన్ని చూడనేలేదు. దీపావళిసరదా ఆ బాలదంపతుల కెంత ఆయాస పరచినదో చూచారా?